క్లుప్తంగా

అమ్మవారి ఆలయంలో అన్నసమారాధన


అన్నప్రసాదం వడ్డిస్తున్న గుజ్జు వెంకటరెడ్డి

మర్రిపాలెం: మర్రిపాలెం 104 ఏరియాలోని కుంచాలమ్మ, దుర్గాలమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఈ నెల 3న అమ్మవార్ల ప్రధాన పండగ, 10న మారు వారం నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్నసంతర్పణలో సుమారు 2,500 మందికి ప్రసాద వితరణ చేశామన్నారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు ఆశి చిన్నారావురెడ్డి, చైర్మన్ నంబాళ్ల నాగేశ్వరరావు, సెక్రటరీ నంబాళ్ల మోహన్‌రావు తదితర సభ్యులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కంచరపాలెం సీఐ చంద్రశేఖర్

మర్రిపాలెం: ఎటువంటి తగాదాలు, గొడవల జోలికి వెళ్లకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని రౌడీషీటర్లకు సీఐ చంద్రశేఖర్ సూచించారు. కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహిస్తూ మాట్లాడారు. ఎటువంటి అఘాయిత్యాలు, కొట్లాటల జోలికి వెళ్లినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని, హద్దు మీరి ప్రవర్తిస్తే ఉపేక్షించేది లేదన్నారు. మంచిగా మెలగాలని, కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా జీవించాలని సూచించారు.

సత్ప్రవర్తనతో మెలగండి



రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఫోర్త్ టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ ఎస్ఐ చిన్నంనాయుడు సూచించారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జీవించాలని, హద్దులు మీరితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

రేపటి నుంచి టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

మురళీనగర్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 21వ తేదీ వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.నారాయణరెడ్డి, ఎస్.వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు 17న భజన రామాయణం, 18న భజన మహాభాగవతం, 19న భజన శ్రీమద్భగవద్గీత, 20న కుంకుమ పూజ, పురాణ ప్రవచనం, 21న పురాణ ప్రవచనం, భజన నిర్వహిస్తామని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో కొలువై ఉన్న ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 కౌంటర్లు ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ లండా రమణ, సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

గురి పెట్టారు.. స్కాలర్ పట్టారు


మాధవధార హైస్కూల్‌లో విద్యార్థులకు సూచనలిస్తున్న ఉపాధ్యాయుడు జానకీరామ్


ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌కు సిద్ధమవుతున్న విద్యార్థులు

- ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో మాధవధార హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ
- మూడేళ్లుగా కేంద్ర ప్రభుత్వ ఉపకార వేతనాలకు ఎంపిక
- ఉపాధ్యాయుల ప్రత్యేక శిక్షణతో సత్ఫలితాలు
- తమ లక్ష్యం తెలియజేసిన ఉత్తీర్ణులు


సందేహాలు నివృత్తి చేస్తున్న ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థిని

మురళీనగర్: ప్రైవేట్ విద్యను ఫ్యాషన్‌గా భావిస్తున్న నేటి తరానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభతో విద్యార్థులందరికీ ఒక కొత్త మెసేజీ ఇస్తున్నారు. కేవలం పదో తరగతి ఫలితాల్లోనే ప్రైవేటుకు దీటుగా ప్రతిభ చాటడంతోనే వీరు సరిపుచ్చుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తలచుకుంటే తాము సాధించలేనిది ఏదీ లేదని నిరూపించారు. జాతీయ స్థాయిలో నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్ 2024–25) పరీక్షలో మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఐదుగురు 8వ తరగతి విద్యార్థులు జి.విద్య, బి.సంజయ్, బి.అనిల్, డి.చరణ్, టి.యామిని ఉపకార వేతనానికి ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి ఏడాది 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకు ఏటా రూ.12 వేల చొప్పున మొత్తంగా ఈ నాలుగేళ్లకు వీరు రూ.48 వేలు అందుకుంటారు. మూడేళ్లుగా ఈ పాఠశాల నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థులు ఎంపికవుతున్నారు. 2022–23లో ముగ్గురు, 2023–24లో నలుగురు, ఈ ఏడాది 2024–25లో ఐదుగురు విద్యార్థులు ఈ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. గతేడాది వై.షన్ముఖ్, ఎ.ద్రాక్షణ్య, జామి మౌనిక, టి.దివేన ఎంపికైన విషయం తెలిసిందే. వీరికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్ అందుతోంది.

రెండు నెలల నిరంతర శిక్షణ



ఎన్‌ఎంఎంఎస్ టెస్ట్‌కు రెండు నెలల నుంచే శిక్షణ, నెల రోజుల ముందు నుంచి ప్రత్యేక ప్రణాళిక అమలు చేశాం. పరీక్ష డిసెంబర్–2024లో జరిగింది. అక్టోబర్ నుంచే విద్యార్థులను సిద్ధం చేశాం. ఫిజికల్ సైన్స్, బయాలజీ, సోషల్, మ్యాథ్స్‌తో పాటు రీజనింగ్‌పై ప్రత్యేక తరగతులు నిర్వహించాం. ముందు ఏడాది సమ్మర్ హాలీడేస్‌లోనే అప్‌కమింగ్ 8వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ ఇచ్చాం. ఫిజిక్స్ టీచర్ వి.వి.జానకీరామ్ దసరా సెలవుల్లో ప్రతి రోజు ఉదయం 6 గంటలకే ఆన్‌లైన్ తరగతులు నిర్వహించేవారు. ఆయనతో పాటు డి.శివరామ్, బాబూరావు మెంటార్లుగా వ్యవహరించారు. డోనర్స్ ద్వారా మెటీరియల్ సమకూర్చాం. మా విద్యార్థులు కూడా పట్టుదలతో చదివి స్కాలర్‌షిప్ సాధించడం ఎంతో గర్వకారణం.

– బి.హేమలత, హెచ్‌ఎం, మాధవధార జీవీఎంసీ హైస్కూల్

పట్టుదలతో చదివా..



జాతీయ స్థాయిలో ఉపకార వేతనం సాధించడం ఎంత కష్టమో నాకు ఇప్పుడు తెలిసింది. ఈ పరీక్షలో 108 మార్కులు వచ్చాయి. పట్టుదలతో ఎలాగైనా సాధించాలని చదివి ఎంపికయ్యాను. మా నాన్న పాపారావు చిరుద్యోగి. అమ్మ పార్వతి గృహిణి. మా పాఠశాల హెచ్‌ఎం బి.హేమలత నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులు మా కోసం తమ విలువైన సమయాన్ని కేటాయించి కోచింగ్ ఇవ్వడం వల్లే మేము ఈ లక్ష్యాన్ని చేరుకోగలిగాం. ఉచితంగా స్టడీ మెటీరియల్ ఇచ్చారు. గ్రూప్‌ల వారీగా డిస్కస్ చేసి స్కాలర్‌షిప్ సాధించాం.

– జి.విద్య, తెన్నేటినగర్

వేకప్ కాల్‌తో ప్రారంభం



మా ప్రిపరేషన్ జానకీరామ్ మాస్టారు నుంచి వచ్చే వేకప్ కాల్‌తో ప్రారంభమయ్యేది. ఉదయం 5 గంటలకు లేచేవాడిని. రాత్రి 11.30 వరకు చదివేవాడిని. నాన్న ప్రభాకర్ కార్పెంటర్‌గా పని చేస్తున్నారు. అమ్మ జ్యోతి గృహిణి. నా ఆశయం సెయిలర్ అవుదామనుకుంటున్నాను. షిప్ కెప్టెన్ అవ్వాలి. ఇప్పటి నుంచే ఇందుకు సిద్ధమవుతున్నాను. టెస్ట్‌లో అత్యధిక మార్కులు సాధిస్తాను. అమెజాన్ ఫ్యూచర్ ఇంజినీర్ పోటీల్లోనూ ఎంపికయ్యాను. 114 మార్కులు వచ్చాయి.

–బి.సంజయ్‌కుమార్, ఎన్‌జీజీవోస్ కాలనీ

ప్రభుత్వ ఉద్యోగం సాధిస్తా



ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలో 94 మార్కులు వచ్చాయి. నాన్న కనకరాజు ప్లంబర్‌గా పనిచేసేవారు. ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. అమ్మ పద్మ గృహిణి. పాఠశాలలో అదనంగా సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు చదివేవారం. శిక్షణలో డిజిటల్ పరికరాలు ఉపయోగించడం వల్ల ఎక్కువగా ప్రాక్టీస్ చేయగలిగాం. ఇంట్లో పరిస్థితిని బట్టి ఉన్నత చదువులు చదువుతాను. ప్రభుత్వ రంగం రైల్వే, నేవీలో ఉద్యోగం సాధిస్తాను.

– బి.అనిల్, మాధవధార

చాలా సంతోషంగా ఉంది



ఉపకర వేతనానికి ఎంపికవడం చాలా సంతోషంగా ఉంది. గ్రూప్ డిస్కషన్ వల్ల మంచి ప్రయోజనం ఉంది. పుస్తకాలు ఉచితంగా ఇచ్చారు. మొత్తం పది పరీక్షలు రాశాం. ఆదివారాలు కూడా మా టీచర్లు మాకోసం వచ్చారు. మా ముందు సెలక్ట్ అయిన విద్యార్థులు మాకు డౌట్స్ తీర్చేవారు. 99 మార్కులు వచ్చాయి. మా నాన్న నేంద్ర కుమార్ చిరుద్యోగి. అమ్మ కల్యాని గృహిణి. డిఫెన్స్‌లోకి వెళ్లి నేవీలో కంప్యూటర్ ఇంజినీర్ అవుతా.

– డి.చరణ్, మర్రిపాలెం

బ్యాంక్ జాబ్ చేస్తా..



అన్ని విధాలుగా మా ఉపాధ్యాయులు సహకరించారు. 96 మార్కులు వచ్చాయి. నాన్న నిఖిల్ పెయింటర్. అమ్మ భవానీ గృహిణి. అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఆర్థికంగా వెనుబడిన వారికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. మాలో కాంపిటీషన్ స్పిరిట్ అలవడుతుంది. టెన్త్ తరువాత అకౌంట్స్ గ్రూప్ తీసుకుని బ్యాంకు మేనేజర్ అవుతాను. ఈ పరీక్షకు ప్రిపేరవ్వాలని ప్రతి విద్యార్థిని ప్రోత్సహించారు.

– టి.యామిని, సింగరాయిమెట్ట

బ్యాంకర్స్ క్రికెట్ టోర్నీ విజేత యూబీఐ


ట్రోఫీతో యూనియన్ బ్యాంకు క్రికెట్ సభ్యులు

సీతంపేట: బ్యాంకర్స్ క్రికెట్ టోర్నమెంట్‌లో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా టీం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు టీంపై ఆరు వికెట్ల తేడాతో గెలుపొందింది. పీఎంపాలెం స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో యూనియన్ బ్యాంక్ టీం విజేతగా నిలిచింది. ఈ పోటీలో మొత్తం 12 టీమ్స్ పాల్గొన్నాయని, ఉత్కంఠగా సాగిన టోర్నమెంట్‌లో తమ టీం ఫైనల్స్‌లో గెలవడం చాలా ఆనందంగా ఉందని యూనియన్ బ్యాంకు టీం కెప్టెన్ డి.సంతోష్‌కుమార్ తెలిపారు. బ్యాంకర్స్ అందరికీ ఇలా క్రికెట్ మ్యాచ్ పెట్టడం సంతోషంగా ఉందని, ఇటువంటి టోర్నమెంట్లు మరిన్ని నిర్వహించాలన్నారు. ఇటువంటి పోటీలు బ్యాంకర్స్‌కి ఫిట్‌నెస్, ఒత్తిడి నుంచి రిలీఫ్ ఇస్తాయన్నారు.

ఉత్సాహంగా జిల్లా స్థాయి నడక పోటీలు


నడక పోటీలు ప్రారంభిస్తున్న ముఖ్య అతిథులు

కంచరపాలెం: ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శ్రీ స్టార్స్ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి సర్వోత్తమ సుకుమార్, అధ్యక్షుడు జయతి ఉమామహేశ్వరరావు నేతృత్వంలో జిల్లా స్థాయి 4కే–2025 నడక పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వాకర్స్ డిస్ట్రిక్ట్ 101 ఇంటర్నేషనల్ గవర్నర్ కె. ద్వారకనాథ్ పాల్గొని జెండా ఊపి నడక పోటీలను ప్రారంభించారు. 30 ఏళ్ల నుండి 80 ఏళ్ల వయసు కలిగిన సుమారు 265 మంది స్త్రీ, పురుషులు పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ముందుగా ఇంటర్నేషల్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు స్వర్గీయ సుందరి ఆళ్వార్ దాస్, ప్రముఖ సామాజిక సంస్కర్త, ఆధ్యాత్మికవేత్త రౌతు ఆదినారాయణ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విజేతలకు త్వరలో బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు జె. రమేష్‌కుమార్, కార్యదర్శి కాళ్ల వెంకటప్రసాద్, కోశాధికారి కిషోర్ కుమార్, సహ కార్యదర్శి ఇమ్మానుయేల్, శిలపరశెట్టి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే పనుల్లో భద్రతకు ప్రాధాన్యం


మాట్లాడుతున్న డీఆర్ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం: డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా ఆదివారం ఆయా విభాగాల అధికారులు, సిబ్బందితో సింహాచలం నార్త్ క్రూ లాబీలో సేఫ్టీ సెమినార్ నిర్వహించారు. వాల్తేర్ డివిజన్లో ప్రస్తుతం జరుగుతున్న పలు భద్రతా, ఆధునికీకరణ పనులను పర్యవేక్షించారు. రైల్వే పనుల్లో భద్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు సూచించారు. లెవెల్ క్రాసింగ్స్ నిర్వహణ, వంతెనలు, మలుపులు, టన్నెల్స్, సిగ్నలింగ్ సిస్టం, ఇతర భద్రతాపరమైన విషయాల గురించి డీఆర్ఎం చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ ఎం.కె.సాహూ, సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్(ఆపరేషన్స్) శివనరేష్, డీఈఈ(ఆపరేషన్స్) సంచయ్ ఆడారిలను ఘనంగా సత్కరించారు. సమావేశంలో లోకో ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల పిల్లలకూ ‘తల్లికి వందనం’ ఇవ్వాలి


రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న వామనమూర్తి, ఆటో డ్రైవర్లు

తాటిచెట్లపాలెం: ఆటోడ్రైవర్ల పిల్లలకూ తల్లికి వందనం వర్తింపజేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. వామనమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం రైల్వేస్టేషన్ పోస్టాఫీసు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వామనమూర్తి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి వస్తే ఇంట్లో ఎందరు పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు కరెంటు బిల్లు 300 యూనిట్లు దాటిన వారికి, ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన ఆటో డ్రైవర్లకు ఈ కరెంటు బిల్లు లింకు సాకు చూపి తల్లికి వందనం ఎగ్గొట్టడం, మొండిచేయి చూపడం అన్యాయమన్నారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. విశాఖలో ఈ నెల 21వ తేదీన జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముందే ఆటో డ్రైవర్ల పిల్లలకు తల్లికి వందనం డబ్బు బ్యాంకుల్లో వేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో స్టాండ్ అధ్యక్షుడు వై. వెంకట్, రవి, కృష్ణ, రమేష్, రాజేష్, గణేష్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి గ్లోబల్ యాప్‌తో అభ్యున్నతి


గ్లోబల్ యాప్‌ను ఆవిష్కరిస్తున్న పద్మశాలి ప్రతినిధులు

సీతంపేట: పద్మశాలీల అభ్యున్నతికి పద్మశాలి గ్లోబల్ యాప్ ఎంతో ఉపయోగపడే డిజిటల్ వేదిక అని పద్మశాలి గ్లోబల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు మేరువ వెంకటేశ్వర్లు, స్వాతి సైన్స్ ఒంగోలు చైర్మన్ కవరతపు ప్రసాదరావు, రోఎస్ఐటీ సొల్యూషన్స్ డైరెక్టర్ గోలి తిరుపతిరావు, కర్నూలు మాజీ ఎంపీ సింగరి సంజీవ్ కుమార్ అన్నారు. శంకరమఠం రోడ్‌లో ఉన్న పద్మశాలి భవన్‌లో జరిగిన ఆత్మీయ సమావేశంలో పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఎదురు చూడకుండా తమ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని పిలుపు నిచ్చారు. పద్మశాలి గ్లోబల్ యాప్ ఆవిష్కరణ గర్వకారణమైన విషయమన్నారు. ఈరోజు నుంచి పద్మశాలి చరిత్రలో కొత్త అధ్యాయం మొదలవుతుందని తెలిపారు. భౌగోళిక సరిహద్దులు చెరిపేసి గ్లోబల్ పద్మశాలి కుటుంబ నిర్మాణానికి దోహదపడిన రోజని పేర్కొన్నారు. నాటి మగ్గం నుంచి నేటి సాంకేతిక విజ్ఞానం దాకా పద్మశాలీయుల ప్రతిభ సమాజానికి సేవ చేస్తోందన్నారు. ఈ యాప్ ద్వారా పద్మశాలి కులస్తుల సాధికారత, వివాహ సంబంధాలు, వేడుకలు, అభిప్రాయ సేకరణ, ఎన్నికల నిర్వహణ, సమస్యల పరిష్కారం, పేద పద్మశాలి కుటుంబాలకు సహాయం, పద్మశాలి సంస్కృతి రాబోయే తరానికి అందిచండం లక్ష్యంగా యాప్ సేవలందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి నాయకులు పప్పు రాజారావు, సూరిశెట్టి సూరిబాబు, బురిడి కల్యాణి, కొప్పుల రమేష్ వానపల్లి ఈశ్వరరావు, రాపర్తి సుబ్బారావు, కొప్పుల రామ్‌కుమార్, కోడిదాసు శ్రీనివాసరావు, పలువురు పద్మశాలి సంఘ నాయకులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో విజయం సొంతం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అవినాష్, వివేకానంద్

సీతంపేట: లక్ష్య సిద్ధి, పట్టుదల, ప్రణాళికాబద్ధమైన కృషితో చదివితే తొలి ప్రయత్నంలోనే సివిల్స్‌లో విజయం సాధించవచ్చని ఆర్క్ రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ హెచ్‌వోడీ అడ్మిన్ అవినాష్, డైరెక్టర్ వివేకానంద్ అన్నారు. రామాటాకీస్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సివిల్ సర్వీసెస్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వీయ ప్రేరణ, సరైన గైడెన్స్‌తో రెండేళ్ల పాటు చదివితే సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. తెలంగాణతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన తక్కువగా ఉందన్నారు. సివిల్స్‌లో ర్యాంకుల సంఖ్య ఏటేటా తగ్గుతూ వస్తోందన్నారు. ఆంధ్రాలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన తక్కువగా ఉందని, తక్కువ మంది విద్యార్థులు సివిల్స్ వైపు వెళ్తున్నారని గుర్తించి విశాఖలో సివిల్స్‌కు ఎలా సన్నద్ధం కావాలో తెలియజేసేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. తమ సంస్థ 2021లో హైదరాబాద్‌లో స్థాపించామని, నాలుగేళ్లలో 68 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. క్రమం తప్పకుండా తరగతులకు హాజరు కావడం, క్లాస్ నోట్సు చదవడం, టెస్టులు రాయడం ఇలా ఒక ప్రణాళిక ప్రకారం ముందుకు సాగితే తొలి ప్రయత్నంలో విజయం సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

వివేకానంద ఆశ్రమవాసుల కాశీయాత్ర

దాబాగార్డెన్స్: స్వామి వివేకానంద ఆశ్రమ వాసులు కాశీ పుణ్యక్షేత్రానికి బయలుదేరి వెళ్లారు. ప్రతి సంవత్సరం దాతల సహకారంతో వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు ఆశ్రమ వాసులను ఆధ్యాత్మిక యాత్ర కింద కాశీ, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాలకు తీసుకెళ్తుంటారు. ఈ ఏడాది వాల్తేర్ రగల్స్ రౌండ్ టేబుల్ సభ్యుల సహకారంతో ఆశ్రమ వాసులను కాశీ పుణ్యక్షేత్రానికి తీసుకెళ్తున్నట్టు అప్పారావు చెప్పారు. కాశీకి వెళ్లడానికి, రావడానికి ఖర్చులతో పాటు అక్కడ వసతి కూడా ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల అందజేత


ఈఎంసీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఎ.కె.ఖాన్ తదితరులు

బీచ్‌రోడ్డు: ఎతిహాద్ ముస్లిం కమ్యూనిటీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ముఖ్య అతిథులు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ ఎ.కె.ఖాన్, రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎ.ఎం.డి.ఇంతియాజ్ చేతుల మీదుగా స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఎ.కె.ఖాన్ మాట్లాడుతూ 175 మంది పేద విద్యార్థులకు సొసైటీ ద్వారా రూ.17,50,000 స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో సంభాషించి, భవిష్యత్తు ఆకాంక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సమాధానాలు విని ఆయన సంతోషించారు. ఎ.ఎం.డి.ఇంతియాజ్ మాట్లాడుతూ పిల్లలు ఎల్లప్పుడూ నాణ్యమైన విద్య పొందడానికి అవసరమైన మద్దతివ్వాలన్నారు. ఈఎంసీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు ఐ.హెచ్.ఫారూఖీ మాట్లాడుతూ తమ సంఘం ద్వారా చాలా ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. స్కాలర్‌షిప్‌ల పంపిణీ ద్వారా నిరుపేద పిల్లలు నాణ్యమైన విద్యను పొందేందుకు, వారి లక్ష్యాలను సాధించడానికి ఆర్థికంగా వారిని ప్రోత్సహించడానికి మద్దతిస్తున్నామన్నారు. పేద పిల్లలు, వారి కుటుంబాలను ఆదుకునేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి జాఫర్ హుస్సేన్, ట్రెజరర్ రియాజ్ ఖాన్, ఈఎంసీ సభ్యులు పాల్గొన్నారు.

యూజీడీ లీకేజీతో అవస్థలు


శ్రీనగర్ రోడ్డులో లీకవుతున్న యూజీడీ మ్యాన్‌హోల్

సీతంపేట: జీవీఎంసీ 27వ వార్డు శ్రీనగర్ రోడ్డులోని కూరగాయల బజారు వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు నీరు రోడ్డుపై నుంచి ప్రవహిస్తుండటంతో నివాసులు, పాదచారులు, వాహన చోదకులు రెండు వారాలుగా ఇబ్బంది పడుతున్నారు. కూరగాయల బజారుకు వచ్చే వినియోగదారులు మురుగు నీటిలో వెళ్లలేక అవస్థల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

శ్రావ్యంగా సంగీత కచేరీ


సంగీత గాత్ర కచేరీ చేస్తున్న రమ్య కిరణ్మయి బృందం

మద్దిలపాలెం: త్యాగరాజ ఆరాధన ట్రస్ట్ కార్యక్రమాల్లో భాగంగా వాగ్గేయకారుల జయంత్యుత్సవాల సందర్భంగా ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గాత్ర విద్వాంసురాలు రమ్య కిరణ్మయి గాత్ర సంగీత కచేరీ శ్రావ్యంగా సాగింది. వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, రాంబాబులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రమ్య కిరణ్మయి పలు త్యాగరాజు కీర్తనలు అద్భుతంగా ఆలపించి పరవశింపజేశారు. సుబ్బరాయ శాస్త్రి, ముత్తుస్వామి దీక్షితార్ తదితర వాగ్గేయకారుల కృతులను పాడి సమ్మోహన పరిచారు. వయొలిన్ విద్వాంసుడు ‘సంగీత కళాభారతి’ బిరుదాంకితుడు ఎం.ఎస్.ఎన్.మూర్తి వయొలిన్‌పై వాయించడం కచేరీకి వన్నెతెచ్చింది.

ఫాదర్లకు ఘన వీడ్కోలు


ఫాదర్లను సత్కరిస్తున్న జ్ఞానాపురం ప్రజలు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ పారిస్ విచారణ కర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో సహాయ విచారణకర్తలకు ఆదివారం ప్రజలు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ మేరకు వైజాగ్ ఆర్చ్ డయాసిస్ క్యాథెడ్రల్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకల్లో ఏడాది కాలం పాటు పని చేసి జ్ఞానాపురం ప్రజల మన్ననలు చూరగొన్న సహాయ విచారణ కర్తలు రెవరెండ్ ఫాదర్లు వినయ్‌కుమార్, అంథోనీ రాజ్‌లను ఘనంగా సత్కరించారు. ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ప్రభువు సువార్తను బోధించుటలో చిత్తశుద్ధి, అంకితభావంతో వీరు పనిచేసి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిపూర్వకంగా జరగడానికి ఎంతో సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ రంగస్థల కళాకారులు, వ్యాఖ్యాత పాలమరశెట్టి ఫ్రాన్సిస్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు ముసురు రాజేష్‌బాబు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.